క్లుప్తంగా

పాఠశాలలకు నాణ్యమైన సరకులు పంపిణీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: జిల్లాలో ఆశ్రమ, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలకు నాణ్యమైన నిత్యావసర సరకులు సరఫరా చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. ఐటీడీఏ సమావేశం హాలులో బుధవారం జీసీసీ అధికారులు, వార్డెన్‌లు,హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ నుంచి నవంబర్ నెల వరకు మూడు నెలలు పాటు తక్కువ ధరకు నిత్యావసర సరకులు సరఫరా చేసే వారికి టెండర్లు ఖరారు చేయడం జరుగుతుందని చెప్పారు. సరఫరాలో వెండర్లకు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో డీడీ సీహెచ్ శ్రీనివాసరావు, జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరావు, మేనేజర్లు రాజారెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలి



కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం,హత్య జరగడం అమానుషం.ఈ సంఘటన వైద్య సిబ్బందిని తీవ్ర ఆందోళనకు గురి చేసింది.ఇటువంటి సంఘటనలను ప్రతి ఒక్కరూ ఖండించాలి.దీని బాధ్యులను కఠినంగా శిక్షించాలి. రానున్న రోజుల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ చర్యలు తీసుకోవాలి. గిరిజన ప్రాంతంలో వైద్య సిబ్బందికి సౌకర్యాలతో పాటు భద్రత కల్పించాలి.

– ఆర్.లక్ష్మి, స్టాఫ్ నర్స్, ఎస్ఎన్‌సీయూ, ముంచంగిపుట్టు

మహిళా సిబ్బందికి భద్రత అవసరం



ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న మహిళా వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. లేకపోతే ఎక్కడో కలకతాలోనే కాదు మన రాష్ట్రంలో కూడా మానవ మృగాలు రెచ్చిపోయే ప్రమాదం ఉంది. అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ఏజెన్సీ ప్రాంతంలో వైద్య సిబ్బందికి సౌకర్యాలతో పాటు ప్రత్యేక భద్రత కల్పించాలి.

– డాక్టర్ రాంబాబు, వైద్యాధికారి, డుంబ్రిగుడ

– ముంచంగిపుట్టు/డుంబ్రిగుడ

భవిష్యత్‌కు పునాది విద్యే



కోట్లగరువులో నూతన పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు



విద్యార్థిని ఆప్యాయంగా ఎత్తుకున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

- కలెక్టర్ దినేష్‌కుమార్
- కోట్లగరువు పాఠశాల భవనం ప్రారంభం

పాడేరు : ప్రతి ఒక్కరి భవిష్యత్‌కు ప్రాథమిక దశలో విద్యే పునాది అని, ప్రతి ఒక్కరూ చదువుకోవడం ద్వారా సమాజంలో ఎలా బతకాలో నేర్చుకోవచ్చని కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని వంతాడపల్లి పంచాయతీ కోట్లగరువులో రూ.5లక్షల 15వ ఆర్థిక సంఘం మండల పరిషత్ నిధులతో నిర్మించిన మండల పరిషత్ పాఠశాల భవనాన్ని బుధవారం పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎంపీపీ సొనారి రత్నకుమారి, స్థానిక సర్పంచ్ మాదెల రవణమ్మతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అంతకు ముందు నిర్వహించిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సామర్థ్యాన్ని పరీక్షించేందుకు బేస్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల్లో లోపాలను గుర్తించి మరింత తర్ఫీదు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. పిల్లలకు చదువులు ముఖ్యమని భావించి, మండల పరిషత్ నిధులతో పాఠశాల భవనం నిర్మించడం స్ఫూర్తిదాయకమన్నారు. జిల్లాలో ఇంకా 400 పాఠశాలలకు భవనాలు లేవని, వాటి నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. స్థానిక సర్పంచ్ మాదెల రవణమ్మ విజ్ఞప్తి మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో రోడ్డు, డ్రైనేజీ, కల్వర్టుల నిర్మాణ పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ విద్య ప్రాధాన్యతను గుర్తించి మండల పరిషత్ అభివృద్ధి నిధులతో పాఠశాల భవనం నిర్మించడం గొప్ప విషయమన్నారు. మైదాన ప్రాంతాల నుంచి వచ్చే ఉపాధ్యాయులు పాఠశాలలకు సరిగా రావడం లేదని, స్థానికంగా ఉన్న వారిని విద్యావలంటీర్‌గా నియమించి, వారితో బోధిస్తుండడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని చెప్పారు. విధులకు హాజరుకాని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అనంతరం విద్యార్థులకు కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీపీ, సర్పంచ్ తమ సంతకాలతో కూడిన నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. కలెక్టర్, ఎమ్మెల్యేను స్థానిక గ్రామ సచివాలయ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది, గ్రామస్తులు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎంపీడీవో సాయి నవీన్, ఎంఈవోలు సరస్వతీదేవి, విశ్వప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, వైఎస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, సర్పంచ్‌లు వంతాల రాంబాబు, గొల్లోరి నీలకంఠం, ఎంపీటీసీ దూసురి సన్యాసిరావు, మాజీ సర్పంచ్‌లు శరభ సూర్యనారాయణ, పాంగి నాగరాజు, మినుముల కన్నాపాత్రుడు, సిరగం దశమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు లకే రామసత్యవతి, ఊర్వశిరాణి, బూర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

పాడేరు: మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని పాడేరు పట్టణంలోని తలార్‌సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఈ పోటీలు నిర్వహించారు. పుట్‌బాల్, ఖోఖో, వాలీబాల్, చెస్, బ్యాడ్మింటన్, ఆర్చరీ, హాకీ తదితర పోటీల్లో 11 మండలాల పరిధిలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

విజేతలు వీరే : హాకీ క్రీడలో మొదటి స్థానాన్ని అరకు స్పోర్ట్స్ స్కూల్, రెండో స్థానాన్ని పాడేరు సీఏహెచ్ పాఠశాల, పుట్‌బాల్ పోటీల్లో పాడేరు సీఏహెచ్ పాఠశాల విద్యార్థులు మొదటి, రెండు స్థానాలు పొందారు. ఖోఖోలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మొదటి స్థానంలో, పాడేరు సీఏహెచ్ పాఠశాల విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. బ్యాడ్మింటన్ పోటీల్లో అరకు స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు మొదటి, పాడేరు గౌతమీ స్కూల్ విద్యార్థులు రెండో స్థానం పొందారు. బ్యాడ్మింటన్ (బాలికల విభాగం)పోటీల్లో ఉప్ప గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం, పాడేరు గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు రెండో స్థానం కైవసం చేసుకున్నారు. ఆర్చరీ పోటీల్లో పాడేరు సీఏహెచ్ పాఠశాల విద్యార్థి జి.సంతోష్ మొదటి స్థానం, అరకు స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థి రామ్‌చైతన్య రెండో స్థానంలో నిలిచారు. విజేతలకు స్పోర్ట్స్ డే సందర్భంగా గురువారం కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు బహుమతులను అందజేస్తారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.జగన్‌మోహన్‌రావు తెలిపారు.



ఖో-ఖో ఆడుతున్న విద్యార్థులు



చెస్ ఆడుతున్న బాలికలు



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

కేజీహెచ్‌లో 'మంకీపాక్స్' వార్డు

మహారాణిపేట(విశాఖ): మంకీపాక్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాల మేరకు కేజీహెచ్‌లో అధికారులు ప్రత్యేక వార్డును సిద్ధం చేశారు. క్యాజువల్టీ మేడపై ఉన్న ఐసోలేషన్ వార్డులో 20 పడకలతో వార్డును ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. వ్యాధి నిర్ధారణ, చికిత్స కోసం జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ డి.రాధాకృష్ణ, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.రత్నకుమారి, డెర్మటాలజీ విభాగాధిపతి డాక్టర్ టి.శాంతి, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ఎ.కృష్ణవేణితో కూడిన కమిటీని నియమించారు.



కేజీహెచ్‌లో సిద్ధం చేసిన ప్రత్యేక వార్డు

దంతేవాడ వరకు మాత్రమే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం(విశాఖ): కేకే లైన్ పరిధి బచేలి–కిరండూల్ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

- విశాఖపట్నం–కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ గురువారం నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది.
- ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు కిరండూల్–విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ దంతేవాడ నుంచి బయలుదేరుతుంది.
- ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు విశాఖపట్నం–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది.
- ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ నుంచి బయలుదేరుతుంది. ఈ తేదీల్లో దంతేవాడ–కిరండూల్ మధ్య ఈ రైళ్ల రాకపోకలు సాగించవు.

భక్తిశ్రద్ధలతో శివలింగం పునఃప్రతిష్ఠాపన



సొలభంలో ప్రతిష్ఠించిన శివలింగం



ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును సత్కరిస్తున్న నీలకంఠేశ్వర ఆలయ కమిటీ సభ్యులు



భక్తి పాటలను ఆలపిస్తున్న భజన బృందం


జి.మాడుగుల: మండలంలోని సొలభం పంచాయతీ కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీనీలకంఠేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శివలింగం, ఇతర దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. 400 సంవత్సరాల కిందట నిర్మించిన ఆలయం జీర్ణస్థితికి చేరడంతో కొత్త ఆలయాన్ని నిర్మించి, అప్పటి శివలింగాన్ని పునఃప్రతిష్ఠించారు. శివలింగంతో పాటు గణపతి, పార్వతీమాత, నందీశ్వర విగ్రహాలను ప్రతిష్ఠించారు. విశాఖపట్నం జిల్లా భీమిలి సద్గురు సేవాశ్రమం, గాంధీనగర్ శ్రీహనుమ సేవాశ్రమం ప్రతినిధి శ్రీ సాయిరాం స్వామిజీ, దాతల, గ్రామస్తుల శ్రమదానం, ఆర్థిక సాయంతో శివాలయం నిర్మాణం, ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని జరిపారు. ఈ ఉత్సవాలు సోమవారం నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు బృందాలతో భజన కార్యక్రమం జరిగింది. మండలంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వివిధ ప్రజాప్రతినిధులు స్వామి వారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సుమారు 5వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా సాయిరాం స్వామిజీ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని ప్రజలను మద్యం, మత్తు పానీయాల నుంచి దూరంగా ఉంచేందుకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజల్లో భక్తిభావం పెంపొందించడానికి గ్రామాల్లో దేవాలయాలు నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా కమిటీ కన్వీనర్ మత్స్యరాస మత్స్యరాజు, విశ్వహిందూపరిషత్ జిల్లా ధర్మ ప్రసార ప్రముఖ్ అప్పలరాజు, భక్త సంఘం నాయకులు శ్రీను, సన్యాసిరావు, గ్రామపెద్దలు మాజీ సర్పంచ్ కొండనాయుడు, భీమశంకర్, పంతులరాజు,మత్స్యకొండంబాబు, శ్రీ నీలకంఠేశ్వర ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో గిరిజనుల్లో భక్తి భావం మరింత పెరుగుతుందని పాడేరు ఎమ్మెల్యే,వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెలిపారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో నీలకంఠేశ్వరస్వామిని ఎమ్మెల్యే దర్శించుకుని, భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికి, దుశ్శాలువాతో సన్మానించారు. అనంతరం విశ్వేశ్వరరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు మన్మధరావు, పండన్న, మత్స్యకొండబాబు,చంద్రపతి, చినమత్స్యకొండబాబు పాల్గొన్నారు.

సింహగిరిపై సందడిగా ఉట్ల సంబరం

శ్రీకృష్ణుడి అలంకారంలో దర్శనమిచ్చిన అప్పన్న



శ్రీకృష్ణాలంకారంలో అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి



ఉట్టిని అందుకుంటున్న యాదవుడు




తాడుని లాగుతున్న స్థానాచార్యులు, పురోహిత్ అలంకారి



స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో శ్రీనివాసమూర్తి దంపతులు

సింహాచలం: శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం సింహగిరిపై ఉట్ల సంబరాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని శ్రీకృష్ణుడిగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా డోలీలో ఉంచి ఆలయ రాజగోపురం వద్ద అధిష్టింపజేశారు. రాజగోపురం ఎదురుగా ఏర్పాటు చేసిన ఉట్టిని యాదవులు అందుకోవడానికి ప్రయత్నించగా.. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తాడు లాగుతూ సందడి చేశారు. అనంతరం స్వామికి వెన్న, పాలు నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ప్రసాదం అందజేశారు. భక్తులు ఉట్ల సంబరాన్ని తిలకించి స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఉత్సవంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సీనియర్ నాయకుడు జర్సింగికి ఎంపీ పరామర్శ



బాలంనాయుడుని పరామర్శిస్తున్న ఎంపీ తనూజరాణి, మాజీ ఎమ్మెల్యే పాల్గుణ

పెదబయలు: గిరిజన ప్రాంత రాజకీయ కురువృద్ధుడు, మాజీ ఎంపీపీ జర్సింగి బాలంనాయుడు అనారోగ్యంతో బాధపడుతుండడంతో బుధవారం అరకు ఎంపీ గుమ్మా తనూజ రాణి పరామర్శించారు. వారం రోజులుగా బాలంనాయుడు ఆరోగ్యం బాగా లేకపోవడంతో పెదబయలులో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు జర్సింగి గంగాభవాని, సూర్యనారాయణ, సీనియర్ నాయకులు గంపరాయి సూరయ్య, కనకరాజు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

'కూటమి'లో ఇసుక దుమారం

- రెండు వర్గాల పరస్పర ఫిర్యాదులతో బయటపడుతున్న అక్రమాలు
- మరో రెండు టిప్పర్లను పట్టుకున్న పోలీసులు
- ప్రజాప్రతినిధి వద్ద పంచాయతీ.. జోక్యం చేసుకోనని చేతులెత్తేసిన వైనం



డీఎల్ పురం నుంచి ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న టిప్పర్లు

నక్కపల్లి: కూటమి పార్టీల మధ్య ఆధిపత్య పోరు కారణంగా అనేక ఇసుక అక్రమాలు బయటకు వస్తున్నాయి. ఇసుక అక్రమ తవ్వకాలను, రవాణాను అరికట్టడంలో అధికార యంత్రాంగం డొల్లతనాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. టీడీపీ, జనసేన వర్గాల పరస్పర ఫిర్యాదులతో రేగిన దుమారం హాట్ టాపిక్‌గా మారింది. వారం రోజుల క్రితం ఒక వర్గానికి చెందిన నాయకులు మరో వర్గానికి చెందిన ఇసుక టిప్పర్లను పట్టించారు. ఈ పంచాయతీ స్థానిక ప్రజాప్రతినిధి వరకు వెళ్లింది. ఇరు వర్గాలకు సర్దిచెప్పలేక ఇందులో తాను తల దూర్చలేనని, పట్టుకున్న వాహనాలను వదిలేయమని చెప్పడం భావ్యం కాదంటూ సదరు నేత తప్పించుకున్నారు.

దీంతో బుధవారం మరో వర్గానికి చెందిన రెండు టిప్పర్లను ఇవతలి వర్గం వారు పట్టించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ఈ అక్రమాలు ఏపీఐఐసీ అధికారులు, మైనింగ్ ,స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారుల కంట పడకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వంలో ఇసుక దోపిడీ చేశారంటూ ప్రతిరోజు విమర్శలు గుప్పించిన హోం మంత్రి అనిత ఇలాకాలోనే ఈ ఇసుక దందాలు జరగడం గమనార్హం.

ప్రభుత్వ పెద్దల సహకారం

డీఎల్ పురం సమీప ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. రూ.60 వేలు విలువ చేసే (సుమారు 50 టన్నులు) ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారని అందిన సమాచారం మేరకు పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. సముద్ర తీరప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు ఇటు మైనింగ్, అటు రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులకు సవాల్‌గా మారాయి. పోలీసు దాడులను సైతం ఇసుక మాఫియా బేఖాతరు చేస్తోంది. వారికి ప్రభుత్వ పెద్దల సహకారం ఉండడమే అందుకు కారణమని తెలుస్తోంది.

డీఎల్ పురం, అమలాపురం, వేంపాడు పంచాయతీల పరిధిలో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లోనే ఈ ఇసుక తవ్వకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పరిహారం చెల్లించి స్వాధీనం చేసుకోని భూములపై మాఫియా కళ్లు పడి ఇసుకను దోచేస్తున్నారు.

ఇసుక కల్తీతో లాభం రెండు రెట్లు అధికం

అక్రమంగా తరలించిన సముద్రపు ఇసుకను ప్రభుత్వం డిపోల్లో విక్రయిస్తున్న నాణ్యమైన ఇసుకలో కలిపి విక్రయిస్తున్నారు. ఇలా చేయడం వల్ల మాఫియాకు రెండు రెట్లు అదనంగా లాభం వస్తోంది. ఒక లారీ నది ఇసుకలో రెండు లారీల సముద్రపు ఇసుకను కలిపి విక్రయిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డిపోలో కొనుగోలు చేసిన 30 టన్నుల ఇసుక ధర రూ.32 వేలు ఉంటే దీంట్లో రెండు లారీల సముద్రపు ఇసుకను కలిపి విక్రయిస్తే లక్ష రూపాయల లాభం వస్తోంది.

టిప్పర్లను పట్టుకున్న వ్యవహారంపై నక్కపల్లి సీఐ కుమారస్వామి మాట్లాడుతూ డీఎల్ పురం వద్ద సముద్రపు ఇసుకను తరలిస్తున్నట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. ఎస్ఐ సన్నిబాబును, సిబ్బందిని పంపించి దాడులు చేయగా రెండు టిప్పర్లలో తరలిస్తున్న ఇసుక దొరికిందన్నారు. ఇసుక తవ్వేందుకు ఉపయోగించే పొక్లెయిన్‌ను స్టేషన్‌కు తరలించి, పెనాల్టీ విధించేందుకు తహసీల్దార్‌కు సిఫార్సు చేశామన్నారు.

క్లుప్తంగా

కాంట్రాక్టు లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చింతూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కామర్స్, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టులు బోధించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. సంబంధిత విభాగాల్లో పీజీలో 55 శాతం మార్కులు సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని, పీహెచ్‌డీ, నేషనల్, స్టేట్ లెవల్ ఎలిజబులిటీ టెస్ట్ కలిగిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు వచ్చే నెల ఐదవ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఆరో తేదీన ఇంటర్వ్యూ, డెమోక్లాస్ ఉంటుందని ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు పందిరి రాట



పందిరి రాట వేస్తున్న సిద్ధి వినాయక యూత్ కమిటీ నాయకులు

జి.మాడుగుల: స్థానిక ఆర్టీసీ బస్సు స్టేషన్ వద్ద శ్రీ సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు నిర్వహించడానికి బుధవారం పందిరి రాట వేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు రైతు రాజు,వరుణ్, శ్రీను, రమణ, సత్తిబాబు, శర్మ మాస్టారు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలి



చౌడుపల్లిలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి: పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. ఆయన బుధవారం పలు పాఠశాలలను సందర్శించారు. చౌడుపల్లి పాఠశాలలో రికార్డులను పరిశీలించి, విద్యార్థులను పాఠ్యాంశాలపై ప్రశ్నించారు. విద్యార్థుల నుంచి సంతృప్తికర సమాధానం రాలేదని, వారికి మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్నం భోజనంలో విద్యార్థులకు అందుతున్న ఆహారాన్ని స్వయంగా పరిశీలించి, వడ్డించారు.

మహాధర్నా కరపత్రం విడుదల



కరపత్రం విడుదల చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

మోతుగూడెం: డొంకరాయిలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వచ్చేనెల 5వ తేదీన నిర్వహించనున్న మహాధర్నా కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సభ్యులు, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, మహిళ కార్మికులు పాల్గొన్నారు.

150 మంది గిరిజనులకు వైద్యసేవలు



గిరిజనులకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాంబాబు

డుంబ్రిగుడ: మండలంలోని రంగిలిసింగి పంచాయతీలో బుధవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో కింజేరు, కుజ్జభంగి, బెడ్డగుడ, కూడాబీరు, రంగిలిసింగిలకు చెందిన 150 మందికి వైద్యసేవలందించారు. ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. జ్వర పీడితులకు రక్తపరీక్షలు జరిపి, చర్మవ్యాధులతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేసినట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు పి.రాంబాబు తెలిపారు. ఈకార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సూర్యనారాయణ, పి.మోహన్‌దాసు, పి.డొంబు, కె.దాసు, వి.కేశవరరావు, వైద్యసిబ్బంది మిల్టాన్, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోగుల సహాయకుల నుంచి రక్షణ కల్పించాలి



ఆస్పత్రుల్లో పనిచేసే మహిళా వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి. రాత్రి వేళల్లో ఆస్పత్రులకు వచ్చే అత్యవసర కేసులకు వైద్యం అందించే సమయంలో రోగుల సహాయకులు దౌర్జన్యంగా ప్రవర్తిస్తుంటారు. అటు వంటి సమయంలో డాక్టర్లు, మహిళా వైద్య సిబ్బందికి రక్షణ కావాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసేవారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించాలి. విద్యుత్ సరఫరా, సీసీ కెమెరాల ఏర్పాటులో రాజీ పడ కూడదు.

– కె.ఉషశ్రీ, మెడికల్ ఆఫీసర్,లాగరాయి పీహెచ్‌సీ, రాజవొమ్మంగి మండలం

కఠినంగా శిక్షించాలి



పభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు,సిబ్బందికి భద్రత కల్పించేందుకు చట్టాలు మరింత పటిష్టంగా అమలు చేయాలి. విధి నిర్వహణలో ఉన్న వైద్యులు,సిబ్బందిపై దాడి చేయడం,అమర్యాదగా మాట్లాడడం నేరంగా పరిగణించి కఠినంగా శిక్షించాలి. వైద్యులంటే ప్రాణరక్షకులన్న గౌరవంతో పాటు వారి జోలికి వెళితే చట్టాలు వదలవన్న భయం రావాలి.

– నూకాలమ్మ, స్టాఫ్ నర్స్,సీహెచ్‌సీ, ముంచంగిపుట్టు

– ముంచంగిపుట్టు/రాజవొమ్మంగి

తగ్గిన పత్తి సాగు

- 150 ఎకరాలకు పడిపోయిన సాగు విస్తీర్ణం
- ప్రత్యామ్నాయంగా అపరాలు, కూరగాయల సాగు





పత్తి పైరు

కొయ్యూరు: మండలంలో పత్తి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ఒకప్పుడు దాదాపు నాలుగు వేల ఎకరాల్లో పత్తి సాగయ్యేది.ప్రస్తుతం 150 ఎకరాలకు పడిపోయింది. పెట్టుబడి పెరిగిపోవడంతో పాటు గిట్టుబాటు ధర లేకపోవడంతో పంటను వేసిన రైతులు ప్రతి ఏటా నష్టాలను చవిచూస్తున్నారు. దశాబ్దం కిందట మండలంలో మెట్ట ప్రాంతాలలో రైతులు పత్తిని ఎక్కువగా సాగు చేసేవారు. బాలారం,కంఠారం, వైఎన్‌పాకలు,కొప్పుకొండ, దొడ్డవరం,రేవళ్లు,మంప తదితర గ్రామాల్లో ఈ పంట పండించేవారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ సాగు తగ్గుతోంది. ఒకప్పుడు ఎకరాకు రూ.10వేల లోపు పెట్టుబడి కాగా, ఇప్పుడది రెండింతలు అవుతోంది. దీంతో పాటు తెగుళ్లు అధికంగా వ్యాపిస్తున్నాయి. సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు రైతులు అధికంగా ఖర్చు చేయవలసి వస్తోంది. దీంతో ఈ కష్టాలు,నష్టాలు భరించలేక రైతులు పత్తి సాగుకు స్వస్తి చెప్పి ఇతర పంటలవైపు మొగ్గు చూపుతున్నారు. పత్తిసాగు చేపట్టిన మొదట్లో రైతులకు పెద్దగా ఇబ్బందులు ఉండేవి కావు. గిట్టుబాటు ధర బాగుండేది. పెట్టుబడి తక్కువయ్యేది.దీంతో ఖరీఫ్‌లో ఎక్కువ మంది రైతులు పత్తిని సాగుచేసేశారు. జూన్‌లో పంటను వేస్తే నవంబర్ నుంచి పత్తి దిగుబడి వస్తుంది. దిగుబడి వచ్చిన తరువాత వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై వారు చెప్పిన ధరకే విక్రయించాల్సి వస్తోంది. దీంతో కనీసం పెట్టుబడి సొమ్ము కూడా చేతికి అందడం లేదు.

కూరగాయలు,అపరాల సాగు.. : ఇప్పుడు పత్తికి బదులుగా అపరాలు,కూరగాయల సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. లాభాలు రాని పత్తిని సాగు చేసే బదులు కూరగాయలు సాగు చేయడమే మేలుగా భావిస్తున్నారు. కొందరు అపరాలతో పాటు ఇతర పంటలను సాగుచేస్తున్నారు.

నష్టాలు వస్తున్నాయి

నష్టాలు వస్తుండడంతో చాలా మంది పత్తి సాగును విడిచిపెట్టారు. పెట్టుబడి కూడా బాగా పెరిగిపోయింది. ప్రత్యామ్నాయంగా కూరగాయలు,అపరాలు సాగు చేస్తున్నారు.

– కనకరాజు, రైతు, చింతలపూడి

గిట్టుబాటు లేకే..



గతంలో ఎక్కువ మంది రైతులు పత్తి సాగు చేసేవారు. పెట్టుబడి పెరిగి పోవడం, గిట్టుబాటు ధర రాకపోవడంతో పత్తి సాగును మానుకుంటున్నారు. గిట్టుబాటు ధర లేకపోవడం వల్లే సాగు చేయడం లేదని పలువురు రైతులు తెలిపారు. తెగుళ్లు కూడా ఎక్కువగా వస్తున్నాయి.

– ఉమాదేవి, ఏవో, కొయ్యూరు

మండల సమావేశాలంటే ఇంత నిర్లక్ష్యమా ?

- అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం
- అధికారుల తీరుపై మండల సమావేశంలో తీవ్ర ఆగ్రహం



పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

డుంబ్రిగుడ: మండల సమావేశాలంటే లెక్కలేదా... ముందే చెప్పినా 13 శాఖల అధికారులు గైర్హాజరయ్యారు, వచ్చిన అధికారులు కూడా తమ ఇష్టానుసారంగా నిర్లక్ష్యంగా 12 గంటల తరువాత హాజరయ్యారని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కలెక్టరుకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. డుంబ్రిగుడ మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ బాకా ఈశ్వరి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సర్వసభ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అధికారుల తీరుపై సమావేశంలో ఆయన మండిపడ్డారు. ప్రజాప్రతినిధులు 10 గంటలకు వస్తే, అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా 12 గంటలకు హాజరయ్యారన్నారు.

అక్రమ కట్టడాలను అడ్డుకోవాలి

టూరిజం అభివృద్ధి చేందుతున్న తరుణంలో అరకులోయ, అరకు, జైపూర్ జంక్షన్‌లలో గిరిజనేతరుల అక్రమ కట్టడాలను విచ్చలవిడిగా చేపడుతున్నారని ఎమ్మెల్యే చెప్పారు. వాటిని నిలుపుదల చేయాలన్నారు. కొత్తగా నిర్మాణాలు చేపడుతున్నట్టు తన దృష్టికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. బోగస్ రేషన్ కార్డులు తొలగించాలని తహసీల్దార్‌కు సూచించారు. పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, ఆశ్రమ పాఠశాలల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని హాస్టల్ వెల్ఫేర్ అధికారికి సూచించారు. పీహెచ్‌సీ హెచ్ఎస్ సారీ మాట్లాడుతూ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సుఖవంతమైన ప్రసవాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రక్తహీనత కలిగిన రోగులకు ఐరన్ మాత్రలు అందజేస్తున్నామని, దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నామని చెప్పారు. అరకు సర్పంచ్ శారద మాట్లాడుతూ ప్రతి శుక్రవారం జరిగే అరకు వారపు సంత ప్రాంగణంలో వ్యర్థాలు విపరీతంగా పేరుకుపోతున్నాయని, వాటిని తరలించేందుకు ఓ ట్రాక్టర్ అవసరమని చెప్పారు. వ్యవసాయాధికారి నీలవేణి మాట్లాడుతూ పోతంగి, కురిడి, అరకు రైతు సేవా కేంద్రాల్లో యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. సర్పంచ్ సునీత మాట్లాడుతూ గసభ పంచాయతీలో ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు జారీ చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ చటారి జానకమ్మ, వైస్ ఎంపీపీలు శెట్టి ఆనంద్, లలిత, ఎంపీడీవో ఉషారాణి, తహసీల్దార్ నాగమ్మ, ఎంపీటీసీలు విజయ, జెమ్మ, పాపారావు, రామరావు, దేవాదాసు, గీత, సర్పంచ్‌లు గుమ్మ నాగేశ్వరరావు, హరి, రామ్మూర్తి, డిప్యూటీ ఎస్‌ఐ గోవిందరావు పాల్గొన్నారు.

శిశు మరణాల నివారణకు చర్యలు



వైద్యశిబిరంలో చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి

చింతూరు: శిశు మరణాలు తగ్గిద్దాం, భవిష్యత్ తరాన్ని కాపాడుదాం అనే నినాదంతో శిశు మరణాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తులసిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తులసిపాక పీహెచ్‌సీ పరిధిలోని లక్కవరంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి శిశు మరణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిల్లల్లో శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తినప్పుడు, ఆస్తమా వచ్చినప్పుడు ఎలా గుర్తుపట్టాలనే దానిపై తల్లులకు ఆయన పలు సూచనలు చేశారు. మూఢ నమ్మకాలు నమ్మవద్దని, ప్రాణాలు రక్షించుకోవడమే లక్ష్యంగా శిశువులను వెంటనే ఆస్పత్రులకు తీసుకు రావాలని ఆయన సూచించారు. బిడ్డల పట్ల తల్లులు అతి జాగ్రత్తగా ఉండాలని, మంచి పౌష్టికాహారం అందించాలని వైద్యాధికారి సూచించారు.

రాజ్‌మా విత్తనాల పంపిణీ



అడుగులపుట్టులో రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో తదితరులు

పెదబయలు: మండలంలోని అడుగులపుట్టు రైతు భరోసా కేంద్రంలో బుధవారం ఏవో ఎ.శ్రీనివాసరావు రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 300 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 30తేదీ వరకు గ్రామ సచివాలయాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు పంపిణీ చేయనున్నట్టు ఆయన తెలిపారు.

వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు పల్లపు వెంకట్

చింతూరు: గ్రామ, వార్డు వలంటీర్లకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం చింతూరులో జరిగిన సమావేశంలో సీఐటీయూ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ రాజీనామా చేసిన వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, వారికి విధి విధానాలు, జాబ్‌చార్ట్ ప్రకటించాలని కోరారు. మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్ మాట్లాడుతూ వచ్చేనెల ఆరున చింతూరులో నిర్వహించే వలంటీర్ల మండల స్థాయి సదస్సులో వలంటీర్లందరూ పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో గ్రామ, వార్డు వలంటీర్ల యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పొడియం జానీ, కలుముల మహేష్, సింగయ్య, రామిరెడ్డి, శేఖర్, ఉదయ్, రాజ్‌కుమార్, అంజి, దుర్గారావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు ఎమ్మెల్యే పరామర్శ



భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : వైఎస్సార్‌సీపీ మాజీ మండల అధ్యక్షుడు లకే సింహాచలం పాత్రుడు మాతృమూర్తి లకే రమణమ్మ మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు బుధవారం మండలంలోని లగిసపల్లి గ్రామానికి వెళ్లి ఆమె భౌతికకాయం వద్ద ఘనంగా నివాళులర్పించి, లకే సింహాచలం పాత్రుడు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు లకే రామకృష్ణపాత్రుడు, కించూరు సర్పంచ్ వంతాల రాంబాబు తదితరులు ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనే పీఎం జన్‌ధన్ లక్ష్యం



కిర్రాబు గ్రామసభలో పాల్గొన్న ఎంపీపీ వెంకటలక్ష్మి, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

రాజవొమ్మంగి : ప్రతి ఇంటికి బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తేవడంతో పాటు ఆదివాసీ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే పీఎం జన్‌ధన్ పథకం లక్ష్యమని స్థానిక ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు అన్నారు. మండలంలోని బోయపాడు, తాళ్లపాలెం, కిర్రాబు కాలనీ, కొత్తకింద్ర, మొల్లిమెట్ల గ్రామాల్లో బుధవారం జన్‌ధన్ పథకంపై ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభల్లో ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలు, స్థితిగతులపై నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. మండలంలోని 75 ఆదివాసీ గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

వై.రామవరం: పీవీటీజీ గ్రామాల అభివృద్ధికి అమలు చేస్తున్న ప్రధానమంత్రి జన్‌మన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు.

రాచపాలెంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, సర్పంచ్ రోలుపల్లి నరసింహమూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం



ఉపాధి సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీడీవో బాపన్న దొర

వై.రామవరం: మండలంలోని ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో కె.బాపన్నదొర ఆదేశించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధికూలీలందరికీ పని కల్పించడంతో పాటు, పనిదినాలను పెంచాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోను తప్పని సరిగా పనులు నిర్వహించాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న పనులను వేగవం తంగా పూర్తిచేయాలన్నారు. అమృత సరోవర్ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కూలీలకు సకాలంలో కూలి సొమ్ము చెల్లించే విధానంపై అవగాహన కల్పించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే క్షమించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సాయిబాబా, టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లు, ఇతర ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు



పరుగు పోటీలో పాల్గొన్న బాలికలు

అరకులోయ టౌన్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించిన క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ, క్యారమ్స్, రన్నింగ్, క్రికెట్ తదితర పోటీలు నిర్వహించారు.ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ కె.భారత్‌కుమార్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజేతలకు 29న బహుమతులు అందజేయనున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో పీడీ అప్పారావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ నాగబాబు, వైస్ ప్రిన్సిపాల్ పుష్పరాజు, ఐక్యూఏసీ కోర్డినేటర్ పి.కొండబాబు, ఎన్ఎస్ఎస్ పీవో వై.విజయలక్ష్మి, ఎం.అనితకుమారి, అధ్యాపకులు ఎల్.ఎం.ఎస్. గణేష్ పాల్గొన్నారు.

96 మందికి రక్త పరీక్షలు



గింజర్తిలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని తంటికొండ సచివాలయం పరిధి గింజర్తిలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 96 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసినట్టు డాక్టర్ సుష్మ తెలిపారు. డెంగ్యూ, మలేరియా జ్వరాలు ప్రబలే సీజన్ కావడంతో ఈ పరీక్షలు చేశామన్నారు. పాజిటివ్ కేసులు నమోదు కాలేదని చెప్పారు. బీపీ, సుగర్ సమస్యలు ఉన్న వారికి ఉచితంగా మందులు అందజేసినట్టు తెలిపారు. ప్రతిఒక్కరూ దోమతెరలు ఉపయోగించాలని అవగాహన కల్పించినట్టు చెప్పారు. గర్భిణులు, బాలింతలకు, అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. సర్పంచ్ ఆగూరి శుభలక్ష్మి, 104 డీఈవో శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మణ్, హెచ్వీ రమాబాయి, ఎంపీహెచ్ఏ లక్ష్మయ్య, ఏఎన్ఎం సన్యాసమ్మ, ఆశలు కుమారి, అమ్మిరాజు తదితరులు పాల్గొన్నారు.

దోస్తులు కలిసే.. బడి మురిసే



పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొయ్యూరు: స్థానిక గురుకుల పాఠశాలలో బుధవారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1998వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం పాఠశాలలో సమావేశమయ్యారు. అలనాటి తీపి ఘటనలను గుర్తు చేసుకున్నారు.క్షేమసమాచారాలు, ఎవరెవరు ఏం చేస్తున్నారో తెలుసుకున్నారు. అన్ని గదుల్లో కలయతిరిగారు. చింతూరు డిప్యూటీ కలెక్టర్‌గా చేస్తున్న అంబేడ్కర్, కొయ్యూరు ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ కూడా అదే సంవత్సరంలో గురుకుల పాఠశాలలో చదవడంతో వారు కూడా ఈ ఆత్మీయ కలయికకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇక్కడ ఉపాధ్యాయులు, విద్యార్థులు వారిని సన్మానించారు.

గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ

గొలుగొండ: గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీహెచ్‌వో బి.జె.వి.ప్రసాద్ వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని పప్పుశెట్టిపాలెంలో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలతో మాట్లాడి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. నిరంతరం వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వ్యాధుల బారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు.

50 ఆలయాలకు పూజా సామగ్రి అందజేత



పూజా సామగ్రి అందజేస్తున్న దానధర్మ ట్రస్ట్ సభ్యులు

అడ్డతీగల: మండలంలోని 50 ఆలయాలకు దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బుధవారం పూజా సామగ్రి అందజేశారు. స్థానిక నాగలింగేశ్వర ఆలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో హిందూ నేషన్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోట రామకృష్ణ మాట్లాడుతూ శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని జిల్లాలో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 101 ఆలయాలకు పూజా సామగ్రి పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ పాడేరు డివిజన్ కన్వీనర్, బీజేపీ అరకు పార్లమెంట్ ఇన్‌చార్జ్ బి.భారతి పలువురు అర్చకులు, ఆలయాల నిర్వాహకులకు పూజా సామగ్రిని అందించారు.ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ సంస్కృతి ప్రముఖ్ అమలేశ్వరి,ఎస్ఎస్ఎఫ్ కన్వీనర్ సత్యనారాయణరెడ్డి, వీహెచ్‌పీ అడ్డతీగల కన్వీనర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.